


జోగినాథం ఆ వూరి అధునాతన వైద్య పద్ధతుల ఆసుపత్రి 'అతిజాగరూక విభాగంలో' చేర్చబడ్డాడు.

ఇందులో విశేషమే వుందీ. రోజూ సవా లక్ష రోగాలొచ్చే కోట్లాది ప్రజల్లో ఇతనొకడు.

కానీ ......

వూరి ప్రజా ప్రతినిధి భుజంగరావు ఆసుపత్రి వైద్యులతో సమాలోచనలు జరుపుతున్నారు. కొంచెం తను ముందు చూపుగా ప్రవర్తించి ఉంటే పరిస్థితి ఇంతవరకూ వచ్చేది కాదనుకున్నాడు. అర్జంటుగా తనకు హైదరాబాద్ నుండి కబురు రావడంతో తను ఊళ్ళో లేని అదను చూసుకుని జోగినాథం తనను ఇరకాటంలో పెట్టేసాడు. తన వైపు తిప్పుకుందామన్నా పడనిచ్చాడు కాదు. ఇప్పుడు ఎటూ పాలు పోని పరిస్థితి. చాలా డబ్బు ఖర్చు పెట్టవలసి వచ్చింది. అయినా ఫలితం అనుమానమే.

"ఏమంటున్నారు డాక్టర్లు" అంటూ వచ్చాడు వెంకట్రావు.

ఈ వచ్చినతను వరసకు భుజంగరావుకు బావమరిది. అతని కుడి భుజం భుజంగరావు నాయకత్వంలో అనేక ఆందోళనల్లో పోలీసు రికార్డుల్లో కెక్కాడు. భుజంగరావును అందల మెక్కించి అతని కొమ్ము కాచుకుంటూ కాల క్షేపం చేస్తున్నాడు. ఇదిగో ఈసారి భుజంగరావుకు పై పదవి చూపించి అతని స్థానంలో ప్రజల్లోకి వెళ్ళాలనుకుంటున్నాడు కూడాను.

భుజంగరావు నిర్లిప్తంగా చూసాడు. వెంకట్రావు మరీ ఆందోళనగా మాట్లాడవేం బావా?" అన్నాడు.

"ఇంకా రెండు మూడు రోజులు దాటితేనే కాని చెప్పటం కష్టం అంటున్నారు. ఇప్పుడతనికి అర్జంటుగా ఆపరేషన్ చేయాలట లక్షలతో వ్యవహారం. అసలు అతని వాళ్ళు వాళ్ళకేం పట్టనట్లు తిరుగుతున్నారు. పట్టించుకున్న వాళ్ళ దగ్గర బూడిద కూడా లేదు. మొత్తానికి నా కొంప మీదకు తెచ్చాడయ్యా... కొడుకు" భుజంగరావు వాపోతున్నాడు.

ఈ వాపోవటానికి కారణం కేవలం అతనికి జోగినాథం మీద కానీ, అతని కుటుంబం మీద కాని అవ్యాజమైన సానుభూతీ, ప్రేమాభిమానం లాంటివి కావు. అసలు భుజంగరావు నిఘంటువులో అటువంటి పదాలు లేవు. పరపతి, పై చెయ్యి పదవి ఇవి వైకుంఠపాళిలో నిచ్చెన్లు లాగా కనిపిస్తున్నాయి. కాని మధ్య మధ్యలో జోగినాథం లాంటి పాములు కూడా కనిపిస్తున్నాయి. ఇవి విషపు పాముల కంటే ప్రమాదకరమయినవి. కనబడకుండా కాటేస్తాయి. ఇదిగో జోగినాథం ఇప్పుడదే పని చేస్తున్నాడు. అయితే వీళ్ళిద్దరికీ ఇంతవరకూ వైరమూ లేదు, స్నేహమూ లేదు. అసలు పరిచయమే లేదు.

మరి ......

"అయితే ఇప్పుడేమిటంటావు" అంటున్నాడు వెంకట్రావు.

ఇతని పరిస్థితి భుజంగరావు పరిస్థితి కంటే మెరుగ్గా లేదు. ఎందుకంటే ఇదివరకు చెప్పినట్లుగానే భుజంగరావు బూట్లలో కాళ్ళుంచటానికి వెంకట్రావు సిద్ధంగానే వున్నాడు. వెంకట్రావుకి తనింతవరకూ వాడిన చెప్పులంటే మొహం మొత్తిపోయింది. కానీ భుజంగరావు బూట్లు వదిలేటట్టుగా లేదు పరిస్థితి.

"నువ్వు డీలా పడిపోతే నాకు భయమేస్తోంది బావా" అన్నాడు వెంకట్రావు.

"డీలా పడక ఏం చెయమంటావోయ్. ఏం చెయటానికీ పాలు పోవటం లేదు!"

"ఆపరేషన్ అవసరమంటారా మందులతో కొన్నాళ్ళు లాగించలేమా?"

"డాక్టర్లు పెదవి విరిచేసారు. అర్జంటుగా ఆపరేషన్ చేయకపోతే ఏ క్షణాన్నయినా ప్రాణం పోవచ్చుట. ఇప్పుడు వాడు చచ్చాడంటే మనం చచ్చామన్నమాటే. అందుకని నువ్వు డాక్టర్లతో మాట్లాడి ఆపరేషన్ ఏర్పాట్లు చేయించు. ఎంత ఖర్చయినా తప్పదు. ఖర్చు గురించి ఆలోచిస్తే లాభం లేదు."

అదీ విషయం.

ఇక్కడ లాభనష్టాల ప్రసక్తి వచ్చింది. కాబట్టి అసలు విషయానికొచ్చేద్దాం.

విషయమేమిటంటే......

పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నాయి. భుజంగరావుకు ఒక పార్టీ తరఫున టిక్కెట్టు దొరికింది. ఆ పార్టీ అధికారంలోకి వస్తే, భుజంగరావుకు మంత్రి పదవి గ్యారంటీ. తనకు ఉన్న హంగు, అర్ధబలాన్ని బట్టి మంచి పదవి కూడా వస్తుంది. (అంటే శాఖాపరంగా) అందుకు కావలసిన హామీ కూడా పొందటం జరిగిపోయింది. భుజంగరావు ఈ ఎన్నికల్లో గెలవటం తథ్యం.

అయితే జోగినాథం ఆ ఎలక్షన్లలో భుజంగరావుకు పోటీగా 'బకెట్' గుర్తు మీద పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి మరి పోలింగ్ తేదీ ఎల్లుండే.

అదండి విషయం.